సాక్షి ఖమ్మం

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



ఉపాధ్యాయులకు తీపికబురు

ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం వెలువరించింది. 10లో



ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక

రాఖీ పండుగ సందర్భంగా మహిళల కోసం ఆర్టీసీ నిర్వహించిన లక్కీ డ్రాలో రీజియన్ స్థాయి విజేతలను ఎంపిక చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం

28° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం కురిసే అవకాశముంది. సాధారణ ఉష్ణోగ్రతలే నమోదువుతాయి.

న్యూస్‌రీల్

హోం మంత్రిని కలిసిన మంత్రి పువ్వాడ



హోంమంత్రి మహమూద్ అలీతో పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా తన పేరు ఖరారు చేసిన నేపథ్యాన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీని కలిశారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన పువ్వాడ... హోం మంత్రితో పలు అంశాలపై చర్చించారు. అలాగే, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను కూడా పువ్వాడ కలిశారు.

రాజీ ప్రయత్నాలు ముమ్మురం చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి రమాదేవి

ఖమ్మంలీగల్: ఈనెల 9న జరగనున్న జాతీయ లోక్‌అదాలాత్ సందర్భంగా కేసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి కె.రమాదేవి సూచించారు. జిల్లా కోర్టులో మంగళవారం న్యాయమూర్తులు, కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించాలని, 9వ తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే రాజీ ప్రయత్నాలు ముమ్మురం చేయాలని తెలిపారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులు, బీమా కంపెనీల న్యాయవాదులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో న్యాయమూర్తులు ఎస్.అమరావతి, మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా, రాంప్రసాద్‌రావు, నాగశ్రావ్య, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతిలత, ప్రాస్యిక్యూషన్ డిప్యూటీ డైరక్టర్ కృష్ణమోహన్, ఏసీపీలు హరికృష్ణ, రెహమాన్, రామానుజం, సారంగపాణి, బస్వారెడ్డి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని కేయూ పీజీ కళాశాలలో ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ తెలిపారు. ఐసెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీ నుండి ప్రారంభం కానున్న వెబ్ ఆప్షన్లలో తమ కళాశాల(కేయూ కేహెచ్‌ఎస్ఎఫ్) ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుంటే సీటు లభిస్తుందని పేర్కొన్నారు. వివరాల కోసం నేరుగా కళాశాలలో కానీ 99122 63863, 94406 52571 నంబర్లలో కానీ సంప్రదించాలని సూచించారు.

59 మందికి సదరమ్ సర్టిఫికెట్లు


ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ శిబిరంలో 59మందిని సర్టిఫికెట్‌కు అర్హులుగా గుర్తించారు. ఈ శిబిరానికి స్లాట్ బుక్ చేసుకున్న 125 మందిలో 105 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వీరికి వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించి 59 మందిని సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

భక్త రామదాసు చివరి ఆయకట్టుకూ సాగునీరు

- ప్రత్యేక పైప్‌లైన్ కోసం రూ.1.19 కోట్లు

కూసుమంచి/తిరుమలాయపాలెం: కూసుమంచి మండలంలోని భక్త రామదాసు ప్రాజెక్టు నుండి తిరుమలాయపాలెం మండలంలో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించేలా ప్రత్యేక పైపులైన్ ఏర్పాటుచేయనున్నారు. ఇక్కడి రైతులు తమ సమస్యను ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి వివరించడంతో ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పైపులైన్ ఏర్పాటుకు రూ.1.19 కోట్లు కేటాయిస్తూ నీటి పారుదల శాఖ చీఫ్ సెక్రటరీ రజత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పైపులైన్ ద్వారా తిరుమలాయపాలెం మండలంలోని లాల్‌సింగ్ తండా, రాజారం, పైనంపల్లి, హాల్ తండా గ్రామాల్లోని 4,500 ఎకరాలకు సాగునీరు అందనుండగా, సుబ్లేడు చెరువుకు సైతం భక్త రామదాసు నీటిని అందించేలా ప్రత్యేక పైపులైన్ మంజూరు చేశారు. ఈమేరకు నిధులు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చేయూతనిస్తారా.. చేయి ఇస్తారా?!



ఇక్కడా పోటాపోటీ

రిజర్వ్ స్థానమైన ఇల్లెందు నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. అయితే పీఈసీ స్థాయిలోనే వడబోత అనంతరం ఇద్దరు నుంచి ముగ్గురినే పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇక సత్తుపల్లి, వైరా, పినపాక, అశ్వారావుపేట స్థానాల్లో కూడా కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ కూడా ఇద్దరు నుంచి నలుగురి వరకు అభ్యర్థులను పరిమితం చేసిన పీఈసీ.. జాబితాను స్క్రీనింగ్ కమిటీకి పంపించింది.

కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

- కొనసాగుతున్న దరఖాస్తుల వడపోత
- మధిరకు భట్టి.. భద్రాచలంకు పొదెం ఓకే
- జనరల్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఉత్కంఠ
- గాంధీభవన్ చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మొదలుకావడంతో ఉమ్మడి జిల్లాలోని ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) ఉమ్మడి జిల్లాకు సంబంధించి మధిర నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, భద్రాచలం నుంచి పొదెం వీరయ్య అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల్లోని కొన్నింటిలో బహుముఖ పోటీ నెలకొనగా... దరఖాస్తుల పరిశీలన అనంతరం జాబితాను పీఈసీ స్క్రీనింగ్ కమిటీకి అందజేసింది. కాగా, బుధవారం ఈ జాబితాను హైదరాబాద్ గాంధీభవన్‌లో పరిశీలించి అధిష్టానానికి తుది జాబితా అందజేసే అవకాశముంది. ఈ నేపథ్యాన స్క్రీనింగ్ కమిటీకి వెళ్లిన జాబితాలో తమ పేరు ఉందా, లేదా అనే ఆందోళన ఆశావహుల్లో నెలకొనగా.. పలువురు హైదరాబాద్‌లో మకాం వేసి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

దరఖాస్తులు ఇచ్చి ప్రదక్షిణలు చేస్తూ..

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు టీపీసీసీకి 120 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గం నుంచి 32 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఇక పినపాక నుంచి 17, వైరా నుంచి 15, పాలేరు నుంచి 14, సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి పది మంది చొప్పున, ఖమ్మం నుంచి తొమ్మిది మంది, అశ్వారావుపేట నుంచి ఎనిమిది మంది, భద్రాచలం నుంచి ముగ్గురు, మధిర నుంచి ఇద్దరు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. అన్నింటినీ పరిశీలించి పీఈసీ ఇద్దరు నుంచి ముగ్గురు అభ్యర్థుల జాబితాను స్క్రీనింగ్ కమిటీకి ఇవ్వగా, ఆ కమిటీ పరిశీలించి అధిష్టానానికి పంపించనుంది.

రాజధానికి ఉరుకులు

స్క్రీనింగ్ కమిటీకి వెళ్లిన జాబితాలో తమ పేరు ఉంటుందని భావిస్తున్న ఆశావహులు టికెట్ సాధన కోసం రాజధాని బాట పట్టారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి అనుచరులు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో కొందరి పేర్లను పీఈసీ ఎంపిక చేసి.. స్క్రీనింగ్ కమిటీకి పంపించింది. దీంతో ఆశావహులు గాంధీభవన్‌కు క్యూ కట్టారు. తమ నేతల ద్వారా సిఫారసు చేయించుకుని టికెట్ దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. స్క్రీనింగ్ కమిటీ బుధవారం అభ్యర్థుల వడపోత కార్యక్రమం నిర్వహించనుండగా.. అక్కడే మకాం వేసిన ఆశావహులు తమ వంతు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

మధిర, భద్రాచలం ఓకే..

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మధిర, భద్రాచలం నియోజకవర్గాలకు అతి తక్కువ దరఖాస్తులు వచ్చాయి. మధిర నుంచి సీఎల్పీ నేత భట్టి, కోట రాంబాబు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క బలమైన అభ్యర్థి అయినందున కమిటీలో అభ్యంతరం ఎదురుకాకపోవడంతో ఆయన పేరు ఖరారు చేశారని సమాచారం. ఇక భద్రాచలం నుంచి మూడు దరఖాస్తులు అందగా, సిట్టింగ్ ఎమ్మెల్యే, భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడైన పొదెం వీరయ్య వైపే కమిటీ మొగ్గు చూపింది.

జనరల్ స్థానాలపై ఆసక్తి

ప్రధానంగా జనరల్ స్థానాల్లో ఎవరికి టికెట్ వస్తుందనే అంశంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం స్థానాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంతలోనే మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరడం ఖరారు కావడంతో ఆయన ప్రధానంగా పాలేరు టికెటే ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యాన పొంగులేటిని అధిష్టానం ఎక్కడి నుంచి బరిలోకి దింపుతుందనే చర్చ జరుగుతోంది. మూడు జనరల్ స్థానాల్లో బహుముఖ పోటీ నెలకొనడంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది.

కరుణించిన వరుణుడు !



తిరుమలాయపాలెంలో జీవం పోసుకున్న పత్తి పంట

- జిల్లావ్యాప్తంగా వాన
- పంగిడిలో అత్యధికంగా 51.8 మి.మీ.ల వర్షపాతం
- రోజంతా వర్షంతో పైర్లకు ప్రాణం

ఖమ్మంవ్యవసాయం: వరుణ దేవుడు కరుణించాడు. నెల రోజుల సుదీర్ఘ విరామం తర్వాత జిల్లాలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురవగా, మిగతా ప్రాంతాల్లో మంగళవారం తేలికపాటి వానలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో సోమవారం నుంచి వర్షాలు పడుతున్నాయి. అయితే, జిల్లాలో సోమవారం అక్కడక్కడా వర్ష ప్రభావం ఉండగా, మంగళవారం మాత్రం చాలా చోట్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం 8:30 నుంచి రాత్రి 8గంటల వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. ఈమేరకు రఘునాథపాలెం మండలం పంగిడిలో అత్యధికంగా 51.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇక వైరాలో 47.3, రఘునాథపాలెంలో 37, ముదిగొండలో 34.5, కామేపల్లి మండలం లింగాలలో 34, తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 30.5, కొణిజర్లలో 29.8, చింతకానిలో 29, తిరుమలాయపాలెంలో 27.5, ఖమ్మం అర్బన్ ఖానాపురంలో 25, కొణిజర్ల మండలం పెద్దగోపతిలో 23.8, ముదిగొండ మండలం బాణాపురంలో 23, సింగరేణి మండలం గేటు కారేపల్లిలో 22.3, కూసుమంచిలో 21.3, ఖమ్మం అర్బన్ ఎన్ఎస్‌టీ గెస్ట్‌హౌస్ వద్ద 20 మి.మీ.ల మేర వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అలాగే, మిగతా ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షపాతం నమోదుకాగా, సత్తుపల్లి, ఎర్రుపాలెం, పెనుబల్లి మండలాల్లో మాత్రం వర్షప్రభావం కనిపించలేదు.

ఊపిరి పోసుకుంటున్న పంటలు

ప్రస్తుతం కురుస్తున్న వానలు పైర్లకు ప్రాణం పోస్తున్నాయి. ప్రధానంగా పత్తి, మెట్ట పైర్లు జీవం పోసుకుంటున్నాయి. జిల్లాలో 1.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈసారి కొంత ఆలస్యంగా సాగు చేశారు. జూలైలో సాధారణానికి మించి వర్షాలు కురవడంతో పత్తి తేమ ప్రభావానికి గురైంది. అయితే, వరికి మాత్రం అప్పటి వానలు అనుకూలంగా మారాయి. కానీ ఆతర్వాత వానలు ముఖం చాటేయడంతో పెసర వంటి పైర్లు దెబ్బతినగా, పత్తి కూడా బెట్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇంతలోనే సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు వర్షం కురవగా, అన్ని పంటలకు ప్రయోజనకంగా మారినట్లయింది.

ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మంసహకారనగర్: నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే ముఖ్య పాత్ర అని.. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి కృషి ఎనలేనిదని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. అయితే, మంచి విద్య అందిస్తూనే విద్యార్థులు నైతిక విలువలు పాటించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈక్రమంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్, ఏడీ వెంకటేశ్వరాచారి, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఈఓలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన 28మందిని సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, పక్కన డీఈఓ శర్మ, అధికారులు

ఉత్తములకు సన్మానం 8లో

భాగస్వామికి 'ఆసరా'

- మృతి చెందిన వృద్ధాప్య పింఛన్‌దారుల వివరాలు సేకరణ
- ఆపై బతికి ఉన్న భాగస్వామికి మంజూరు
- డీఆర్‌డీఓ ద్వారా ప్రభుత్వానికి జాబితా
- ఇప్పటి వరకు జిల్లాలో 3,545 మంది గుర్తింపు



ఖమ్మంమయూరిసెంటర్: వయస్సు పైబడి, ఏ పనికి వెళ్లలేని వృద్ధుల కోసం ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా వృద్ధాప్య పెన్షన్ అందజేస్తోంది. తద్వారా వారి వైద్య ఖర్చులతో పాటు ఇతర అవసరాలు తీరుతున్నాయి. అయితే, భార్యాభర్తల్లో ఒకరికే ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ అందజేస్తుంది. గతంలో వృద్ధ దంపతుల్లో పెన్షన్ అందుకుంటున్న జీవిత భాగస్వామి మరణిస్తే బతికి ఉన్న వారికి పెన్షన్ ఇచ్చేవారు కాదు. ఒకవేళ దరఖాస్తు చేసుకున్నా మంజూరులో తీవ్ర ఆటంకాలు ఎదురయేవి. కానీ ప్రభుత్వం తాజాగా వృద్ధాప్య పెన్షన్ అందుకుంటున్న వ్యక్తి మరణిస్తే ఆయన లేదా ఆమె భాగస్వామికి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుండి ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురాగా, జిల్లాలో అర్హుల గుర్తింపునకు అధికారులు రంగంలోకి దిగారు.

గ్రామగ్రామాన సర్వే

వృద్ధాప్య పెన్షన్ పొందుతూ చనిపోయిన వ్యక్తి జీవిత భాగస్వామి బతికి ఉంటే ఆసరా పింఛన్ మంజూరు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ఆసరా పింఛన్ పొందుతూ మరణించిన వృద్ధులను గుర్తించడమే కాక వారి జీవిత భాగస్వామి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు వివరాలు సేకరించి ఎంపీడీఓలకు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఆసరా పొందుతూ చనిపోయిన వృద్ధులకు జీవిత భాగస్వామి ఉన్నవారు 3,545 మందిని గుర్తించారు.

పింఛన్ మంజూరుకు సిఫారసు

గ్రామాల్లో సేకరించిన వివరాలను ఎంపీడీఓలు తమ లాగిన్ నుండి డీఆర్‌డీఓ లాగిన్‌కు పంపిస్తున్నారు. అక్కడ పరిశీలించి పింఛన్ మంజూరు ఆమోదం తెలపడమే కాక వృద్ధాప్య పెన్షన్‌దారు జీవిత భాగస్వామి ఖాతా వివరాలను ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. తద్వారా వీరికి త్వరలోనే వారికి పింఛన్ మంజూరుకానుంది.

వాడవాడనా చాటింపు వేయించండి

నేలకొండపల్లి: వృద్ధాప్య పింఛన్ పొందుతూ ఎవరైనా మరణించి, వారికి జీవిత భాగస్వామి ఉంటే ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. ఖమ్మం నుంచి ఆయన మంగళవారం పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఐకేపీ ఏపీఎంలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సూచనలు చేశారు. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే వారి జీవిత భాగస్వామికి వెంటనే పింఛన్ మంజూరయ్యే అవకాశమున్నందున, వీరి వివరాల సేకరణకు అందరూ చొరవ చూపాలని తెలిపారు. ఈ విషయమై అవగాహన లేనందున అన్ని గ్రామాల్లో చాటింపు వేయించాలని సూచించారు.

వివరాలు సేకరిస్తున్నాం..



వృద్ధాప్య పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారులు మరణించి, వారికి జీవిత భాగస్వామి ఉంటే ఆసరా పింఛన్ మంజూరు కానుంది. ఇలాంటి వారి వివరాల సేకరణలో నిమగ్నమయ్యాం. ఆయా వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర కార్యాలయానికి పంపించి పెన్షన్ మంజూరుకు చర్యలు చేపట్టాం.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ, ఖమ్మం

ఓటర్ల జాబితాలో పొరపాట్లు ఉండొద్దు

బీఎల్‌ఓల శిక్షణలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఓటరు జాబితాను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సిద్ధం చేయాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో బీఎల్‌ఓలకు మంగళవారం ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జాబితా సిద్ధం చేయాలని, అనర్హులు, మృతుల పేర్లు తొలగించే సమయాన జాగ్రత్త వహించాలని చెప్పారు. అలాగే, కొత్త దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాకే ఓటు హక్కు కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె.శ్రీరాం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించగా, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

వర్షాలతో నష్టం ఎదురుకావొద్దు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంఅర్బన్: భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యాన ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్‌నుంచి ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో నష్టం ఎదురుకాకుండా తీసుకున్న చర్యలను వివరించారు. ఆతర్వాత ఆయన జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఉధృతంగాప్రవహించే వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, రహదారులపైకి నీరు చేరితే రాకపోకలు నిలిపేయాలని సూచించారు. ఇక ఇదే విషయమై అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులతో వీసీ ద్వారా మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎక్కడ కూడా నష్టం ఎదురుకాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశాల్లో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ నర్సింగరావు, డీఎస్ఈ ధన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ అప్పారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్, ఈఈలు వెంకట్రాం, మంగళపుడి వెంకటేశ్వర్లు, డీఎల్పీఓ పుల్లారావు పాల్గొన్నారు.



కేఎంసీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ఆదర్శ్, అధికారులు

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

ఖమ్మంమయూరిసెంటర్: తాగునీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కేఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి సరఫరా, హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులు, ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల పనుల పురోగతిపై సమీక్షించారు. అధికారులు రోజువారీగా పనులను పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ బి.మాలతి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, పీఆర్ ఈఈలు కేవీకే.శ్రీనివాస్, చంద్రమౌళి, మున్సిపల్ డీఈలు రంగారావు, స్వరూపారాణి, నవ్యజ్యోతి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ నర్సరీలో రగడ

- మొక్కల లోడింగ్ నిలిపేసిన కూలీలు
- ధర పెంచాల్సిందేనని డిమాండ్

సత్తుపల్లిరూరల్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచాలని ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అందులో భాగంగా సబ్సిడీపై మొక్కలను సరఫరా చేస్తుండగా, కొందరు నర్సరీల కాంట్రాక్టర్ల తీరుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలోని రేగళ్లపాడులో ప్రభుత్వం, ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యాన ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటుచేశారు. ఇందులో బ్యాగ్‌ల్లో మట్టి నింపడం, విత్తనాలు నాటడం ఇతరత్రా పనులను స్థానిక గిరిజన కూలీలతోనే చేయిస్తూ రోజుకు రూ.500 చెల్లించారు. కానీ ఇటీవల సదరు కాంట్రాక్టర్ వారికి రోజుకు రూ.300 మాత్రమే ఇవ్వడం మొదలు పెట్టారు. అంతేకాకుండా రైతుల నుంచి ట్రాక్టర్‌కు ఇంత, లారీకి ఇంత అని డబ్బు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో స్థానిక కూలీలు సోమవారం సాయంత్రం సదరు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి తమ కూలీ సమస్య పరిష్కరించే వరకు మొక్కలను లోడ్ చేయమని తెలిపారు. అయినప్పటికీ మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి రైతులను మంగళవారం పంపించారు. దీంతో వారు ఉదయం వాహనాలతో రేగళ్లపాడులోని ఆయిల్‌ఫామ్ నర్సరీకి రాగా స్థానికులు కూలీలు పనిచేయలేదు. ఇంతలోనే ఇతర ప్రాంతం నుంచి కూలీలను పిలిపించి మొక్కలను లోడింగ్ చేయిస్తుండడంతో అడ్డుకున్నారు.



మొక్కల లోడింగ్‌ను అడ్డుకుంటున్న స్థానిక కూలీలు

లోడింగ్‌కు రూ.400

ఆయిల్‌పామ్ మొక్కల కోసం వచ్చిన తమ నుంచి ట్రాక్టర్‌కు రూ.400, లారీకి రూ.800 చొప్పున నర్సరీలో పనిచేసే రాకేష్ వసూలు చేస్తున్నాడని రైతులు ఆరోపించారు. అయినాసరే ఇచ్చేందుకు ఒప్పుకున్నా లోడింగ్ ఆలస్యం చేస్తున్నారని చెప్పారు. ఇదే విషయమై కూలీలు మాట్లాడుతూ ఏడాదిన్నరగా పనిచేస్తున్న తమకు కూలీ తక్కువ ఇస్తుండడంతో ప్రశ్నిస్తే ఇష్టముంటే పని చేయండి, లేదంటే వెళ్లిపోండి అని కాంట్రాక్టర్ దబాయించారని కూలీల మేస్త్రీ శిరీష తెలిపారు. కాగా, కూలీల ఆందోళనతో మొక్కల లోడింగ్ నిలిచిపోగా, విషయం తెలుసుకున్న ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి బాలకృష్ణ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పడంతో కూలీలు శాంతించారు. కాగా, రైతుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న విషయాన్ని కాంట్రాక్టర్‌కు చెందిన వ్యక్తి ఆయిల్‌ఫెడ్ అధికారి ముందే అంగీకరించడం గమనార్హం.

ఉత్తములకు సన్మానం

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 28మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన గురు పూజోత్సవంలో వీరికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఈఓ సోమశేఖరశర్మ, అధికారులు పాల్గొన్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


వేంసూరు ఎంఈఓ సీహెచ్.వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఈఓ శర్మ, జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి శ్రీరామ్ తదితరులు


జి.రూన్సీరాణి, బోనకల్ | జె.గురునాథరెడ్డి, బనిగండ్లపాడు | బి.సంగమేశ్వరరావు, మధిర | సీహెచ్.ప్రసాద్, సత్తుపల్లి | హెచ్.శ్రీనివాస్, సింగారెడ్డిపాలెం


హేమాద్రి శైలేంద్ర, గోళ్లపాడు | కె.పద్మావతి, మడుపల్లి | ఆర్.విక్రమ్‌రెడ్డి, కూసుమంచి | ఎస్.సునీత, మిట్టగూడెం | కె.జ్యోతికుమారి, ఇందిరానగర్


ఏ.ప్రవీణ్‌కుమార్, పెద్ద వెంకటగిరి | ఏ.అనిత, ముష్టికుంట్ల | ఎం.శంకర్‌రావు, ఎన్నెస్పీ కాలనీ, ఖమ్మం | బి.నర్సింహారావు, వీఎం బంజర | పి.లూర్దుమేరి, మంగళగూడెం


డి.నాగేశ్వరరావు, రేలకాయలపల్లి | ఆర్.శ్రీనివాసచారి, వైరా | కె.వెంకటేష్, అయ్యగారిపేట | జి.శ్రీనివాసరావు, నామవరం | కె.ప్రభుదాస్, కిష్టారం | కె.రాజ్‌కుమార్, బుద్ధారం | డి.వెంకటేశ్వరరావు, విప్పలమడక | ఎల్.గోపాలరావు, గణేశ్వరం | జి.భారతి, ముత్తగూడెం | డి.రాములు, గుదిమళ్ల | బి.శ్రీనివాసరావు, పోచవరం | ఏ.శాంతారెడ్డి, వైరా

క్లుప్తంగా

కందులు అ'ధర'హో!

● క్వింటాకు రూ.11,500 ధర

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం కందులకు రికార్డు ధర పలికింది. మునుపెన్నడూ లేని విధంగా క్వింటాకు రూ.11,5000 ధర నమోదైంది. అయితే, విక్రయానికి కేవలం మూడు బస్తాల కందులు మాత్రమే వచ్చాయి. పంట సాగు తగ్గడం, దిగుబడి లేకపోవటంతో రైతులు నిల్వ చేసిన కందులను విక్రయానికి తీసుకొస్తున్నారు. ఖమ్మం మార్కెట్‌లో మంగళవారం పలికిన ధర రాష్ట్రంలోనే అత్యధికమని ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. గత నెల 22న రూ.8,900 ధర పలకగా, ఇప్పుడు అంతకు మించి ధర రావడం విశేషం.

'తానా' సమ్మేళనానికి సుర్దేపల్లి కవి


రామకోటేశ్వరరావు

నేలకొండపల్లి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యాన జరగనున్న అంతర్జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొనాల్సిందిగా మండలంలోని సుర్దేపల్లికి చెందిన కవి డాక్టర్ దూత రామకోటేశ్వరరావుకు ఆహ్వానం అందింది. ఈనెల 9వ తేదీన కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ తనకు స్థానం కల్పించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలపగా, స్థానికులు పలువురు ఆయనను అభినందించారు.

ఎన్నికల స్టీరింగ్ కమిటీ చైర్మన్‌ను కలిసిన నేతలు


జిల్లాలో పరిస్థితిపై నివేదిక ఇస్తున్న దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల స్టీరింగ్ కమిటీ చైర్మన్ కె.మురళీధరన్‌ను కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో చైర్మన్ మురళీధర్‌తో పాటు సభ్యులు మహ్మద్ సిద్దిఖీని వేర్వేరుగా కలిసిన వారు జిల్లాలోని పరిస్థితులపై చర్చించారు. తొలుత పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఐదు క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఈఏడాది రాష్ట్ర పాఠశాలల క్రీడా క్యాలెండర్‌ను రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖరారు చేసింది. ఈమేరకు రాష్ట్రస్థాయిలో అండర్–17 బాలబాలికల వాలీబాల్, అండర్–14 బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్, అండర్–17 బాలికల టెన్నికాయిట్ పోటీలు నిర్వహించే అవకాశం ఖమ్మం జిల్లాకు దక్కింది. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అండర్–17 బాలబాలికల క్రికెట్, అండర్–17 బాలబాలికల నెట్‌బాల్ పోటీల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈవిషయాన్ని జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి నర్సింహారెడ్డి వెల్లడించారు.

గుంతను తప్పించబోయి కారు బోల్తా

చింతకాని: మండలంలోని తిరుమలాపురం క్రాస్ వద్ద మంగళవారం ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఖమ్మం నుంచి బోనకల్ వైపు వెళ్తున్న కారు తిరుమలాపురం క్రాస్ వద్ద రహదారిపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న గోతిలో బోల్తా పడింది. అయితే అక్కడ నేల చదునుగా ఉండటంతో కారులోని వారికి ప్రమాదం తప్పగా, స్థానికులు ట్రాక్టర్ల సాయంతో కారును బయటకు తీశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహం

రామాలయంలో రేపు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ మద్భాగవత సప్తాహ హవనం కొనసాగుతోంది. చిత్రకూట మండపంలో ఏర్పాటు చేసిన హోమం వద్ద అర్చకులు, పండితులు అగ్నిప్రతిష్ఠ, వేదవిన్నపం చేశారు. అనంతరం గోపూజ, సప్తాహ పారాయణం ప్రారంభించి భాగవతంలోని 1వ స్కంధం నుంచి 3వ స్కంధంలో 20వ అధ్యాయం వరకు పారాయణం చేశారు. ఈ సప్తాహం 31వ తేదీ వరకు జరగనుంది. ఇక గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారికి బేడా మండపంలో ఊంజల్ సేవ, పుష్పాంజలి, ప్రత్యేక కార్యక్రమాలు గావిస్తారు.

స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఇక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని టూరిజం అధికారులు గతంలో తొలగించగా, ఆలయ ఈఓ రమాదేవి విన్నపం మేరకు మంగళవారం తిరిగి అందజేశారు.


భాగవత పారాయణం చేస్తున్న స్థానాచార్యులు

సమర్థవంతంగా పోషణ అభియాన్

ఖమ్మంఅర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో పోషణ అభియాన్ పథకాన్ని జిల్లాల్లో సమర్థవంతంగా అమలుచేస్తున్నామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుమ వెల్లడించారు. ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని కేసీఆర్ టవర్స్‌లో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడుతూ తల్లీబిడ్డల వెయ్యి రోజుల సంరక్షణపై మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఇందుకోసం సెప్టెంబర్‌ను మాసం పోషణ మాసంగా ప్రకటించి పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు పోషకాహార ఆవశ్యకతను వివరిస్తూ స్టాళ్లు ఏర్పాటుచేయగా, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో కలిసి జిల్లా సంక్షేమ అధికారి సుమ, ఉద్యోగులు ఆరోగ్యలక్ష్మి పథకం క్రింద అందించే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్ నాగమణి, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త పానుగోటి సంపత్, మంచుకొండ పీహెచ్‌సీ సంధ్యారాణితో పాటు షేక్ రహీం, శివ, షేక్ షకీనా తదితరులు పాల్గొన్నారు.


పోషకాహార ప్రదర్శనలతో జిల్లా సంక్షేమ అధికారి సుమ, ఉద్యోగులు

ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా

ఖమ్మంవ్యవసాయం: వేతన సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో టీఎస్ యునైటెడ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) సీబీడీ–ఎస్ఎంజీ కార్మికులు మంగళవారం ధర్నాకు దిగారు. ఖమ్మంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు తగ్గిన విషయమై లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా, యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కె. నాగేశ్వరరావుతో పాటు వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ, సురేష్, గోపీచంద్, కిరణ్, కృష్ణ, నర్సింహారావు, బాను తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏడీటీకి వినతిపత్రం అందించారు.


ధర్నాలో పాల్గొన్న సీబీడీ–ఎస్ఎంజీ కార్మికులు

కలిసి పనిచేద్దాం రండి..

తుమ్మల అనుచరులకు కాంగ్రెస్ నేతల ఆహ్వానం

కూసుమంచి: కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కలిసి పనిచేద్దామని పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులకు సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్టె గురవయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బాణోత్ వినోద, నాయకులు ఎం.డీ.కలీమ్ ఆధ్వర్యాన పలువురు నాయకులు తుమ్మల అనుచరుడైన జొన్నలగడ్డ రవికుమార్ నివాసానికి వెళ్లి చర్చించారు. అభివృద్ధి ఆశయాన్ని నెరవేర్చేందుకు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు. కాగా, తమ పయనం తుమ్మలతోనే సాగుతుందని రవికుమార్ తదితరులు తెలిపారు.


తుమ్మల అనుచరులతో కాంగ్రెస్ నాయకులు

1,950 కేజీల పచ్చళ్లు సీజ్

ఖమ్మంరూరల్: అనుమతి లేకుండా భారీ మొత్తంగా విక్రయిస్తున్న పచ్చళ్లను అధికారులు సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా వూనగట్లకు చెందిన బుర్రా సత్యనారాయణ, శ్రీను వివిధ రకాల పచ్చళ్లను తీసుకొచ్చి ఏదులాపురం వద్ద అద్దె గదిలో ఉంటూ ప్లాస్టిక్ డబ్బాల్లో ప్యాక్ చేసి గ్రామాల్లో తిరుగుతూ అమ్ముతున్నారు. ఈ విషయమై కొందరు రూరల్ సీఐ రాజిరెడ్డికి ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరెడ్డి పరిశీలించి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం ఆయన పరిశీలించి 1,950 కేజీల పచ్చళ్లను సీజ్ చేశారు. వీటి అమ్మకానికి అనుమతి లేకపోవడమే కాక సీసాలపై ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. వీటి విలువ రూ.1.95లక్షలు కాగా, శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించగా, అమ్మకందారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

● ఆందోళనకు దిగిన కుటుంబీకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందటంతో కోపోద్రిక్తులైన బంధువులు ఆస్పత్రిపై దాడి చేశారు. వేంసూరు మండలం కందుకూరుకు చెందిన ఓ మహిళ జ్వరంతో బాధపడుతూ సోమవారం రాత్రి ఆస్పత్రిలో చేరింది. ఆమెకు ప్లేట్‌లెట్లు పడిపోయాయని పరిస్థితి విషయంగా ఉందని చెప్పిన వైద్యులు ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. అయితే, ఆమెను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ సదరు మహిళ బంధువులు ఆస్పత్రికి చేరుకుని అద్దాలు ధ్వంసం చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని వారికి సర్దిచెప్పడంతో శాంతించారు. ఆతర్వాత. ఆస్పత్రి యాజమాన్యం పరిహారం చెల్లించేలా అంగీకరించినట్లు తెలిసింది.

సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం, కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో 14 మందికి మంజూరైన రూ.6.77 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మంలో ఆయన మంగళవారం అందజేసి మాట్లాడారు. కేసీఆర్ అద్భుతమైన పాలనతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల శ్రీనివాసరావు, డేగల ఉపేందర్, వరుణ్‌కుమార్, పాల్వంచ రాజేష్, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణప్రసాద్, మునిగంటి భార్గవ్ పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఎస్సై చేయూత


విద్యార్థి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఎస్సై

కారేపల్లి: ఐఐటీలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థికి కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మండలంలోని ఉసిరికాయలపల్లికి చెందిన ఆటోడ్రైవర్ కరణ్‌సింగ్ కుమారుడు సిద్ధివినాయక్ గుజరాత్ గాంధీనగర్‌లోని ఐఐటీలో సీటు సాధించాడు. అయితే, కరణ్‌సింగ్‌కు తన కుమారుడిని చదివించేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ రామారావు అమెరికాలో ఉన్న తన మిత్రుడైన రాజు సహకారంతో మంగళవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై నాగరాజకుమారి, సిబ్బంది వెంకన్న, సీతారాములు, కౌరమ్మ, శంకర్ పాల్గొన్నారు.

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్‌కు అసాధారణ ప్రదర్శన పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ జాకీరుల్లా, సత్యవతి

ఖమ్మంసహకారనగర్: జాతీయ స్థాయిలో న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిన జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలకు అసాధారణ ప్రదర్శన పురస్కారాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ.ఆర్.సత్యవతి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. రూ.10.30 కోట్లతో నిర్మిస్తున్న మార్కెట్ పరిపాలనా భవనం, యార్డుల పరిసరాల్లో రహదారులను పరిశీలించి సూచనలు చేశారు. మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఈ.మల్లేషం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీరా రాజు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ లక్ష్మణ్, డీఈ సమాధానం, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు రూ.లక్ష జరిమానా

వైరా/తల్లాడ: నాటుసారా తయారుచేస్తూ పట్టుబడిన మహిళను బైండోవర్ చేయగా, మళ్లీ నాటుసారా తయారీకి పాల్పడడంతో రూ.లక్ష జరిమానా విధించారు. తల్లాడ మండలం నారయ్య బంజరకు చెందిన బానోత్ పార్వతి నెల క్రితం నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. దీంతో ఆమెను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కానీ మళ్లీ నాటుసారా తయారుచేయడంతో బైండోవర్‌ను ధిక్కరించినట్లుగా భావించి తల్లాడ తహసీల్దార్ వి.రవికుమార్ ఎదుట మంగళవారం హాజరుపర్చగా రూ.లక్ష జరిమానా విధించడంతో ఆమె చెల్లించిందని వైరా ఎక్సైజ్ ఎస్ఐ మమత తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

ముదిగొండ: మండల కేంద్రంలో మంగళవారం కోతులు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం నుండి బస్సులో వచ్చిన హరీశ్ ముదిగొండలోని ఐకేపీ కార్యాలయం మీదుగా నడిచి వెళ్తుండగా కోతుల దండు దాడి చేసింది. ఈ ఘటనలో ఆయన తల, మెడపై గాయాలు కాగా... అదే సమయానికి పాఠశాల విద్యార్థులను కూడా కోతులు వెంబడించడంతో పరుగులు తీశారు. అనంతరం హరీశ్ స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: ఆయిల్‌పామ్ తోటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం సత్యనారాయణపురంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కిష్టాపురం పంచాయతీ పరిధి సత్యనారాయణపురం శివారులో ఉన్న ఆయిల్‌పామ్ తోటలో మంగళవారం పని చేసేందుకు వెళ్లిన కూలీలు వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఈమేరకు సమాచారం అందుకున్న సత్తుపల్లి పోలీసులు పరిశీలించి ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం లింగగూడెంకు చెందిన చిమట కేశవరావు(30)గా గుర్తించారు. ఆయన మృతి చెంది మూడు రోజులు దాటిందని భావిస్తుండగా ఖమ్మం నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. కాగా, కేశవరావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాబు బంగ్లాకే ముడుపులు..

మళ్లీ ఆ ముగ్గురే

అమరావతి కాంట్రాక్టుల తరహాలోనే 'స్కిల్' స్కామ్.. సూత్రధారి చంద్రబాబే

- 'సీమెన్స్'కి తెలియకుండా ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాయ
- కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి మోసం
- ప్రభుత్వ వాటా పేరుతో డిజైన్ టెక్ కంపెనీకి నిధుల మళ్లింపు
- నకిలీ ఇన్వాయిస్‌లతో డ్రా చేసి పార్థసానికి అందించిన యోగేశ్
- వాటిని హైదరాబాద్‌కు తరలించి చంద్రబాబు పీఎస్‌కు అందించిన పార్థసాని
- ఆ కొల్లగొట్టిన నిధులు చివరకు చేరింది చంద్రబాబు నివాసానికే!
- మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, బాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ నోటీసులు
- విచారణకు హాజరు కావాలని ముగ్గురికీ ఆదేశం
- 'స్కిల్' కుంభకోణం కేసు దర్యాప్తు వేగవంతం



సాక్షి, అమరావతి: తీగ లాగితే డొంకంతా కదులుతోంది! ముడుపుల చిట్టాలన్నీ చంద్రబాబు బంగ్లాకే దారితీస్తున్నాయి!! అమరావతిలో తాత్కాలిక నిర్మాణాలు, టిడ్కో ఇళ్ల కాంట్రాక్టుల్లో ప్రజాధనాన్ని లూటీ చేసిన వ్యవహారంలో ఆదాయపన్ను (ఐటీ) శాఖ తీగ లాగితే... చంద్రబాబు కనుసన్నల్లో సాగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్‌ఎస్‌డీసీ) కుంభకోణం పునాది బయటపడుతోంది. కుంభకోణాలు వేర్వేరైనా కొల్లగొట్టిన ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా తరలించడంలో పాత్రధారులు మాత్రం వారే. ఆ అక్రమార్జన అంతా చివరకు చేరింది సూత్రధారి చంద్రబాబు చెంతకే అన్నది స్పష్టమవుతోంది. టీడీపీ హయాంలో భవన నిర్మాణ ప్రాజెక్టుల కాంట్రాక్టులను కట్టబెట్టడంలో అక్రమార్జనకు సంబంధించి చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసుల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆ కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్న మనోజ్ వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, యోగేశ్ గుప్తా ఏపీఎస్ఎస్‌డీసీ అవినీతి బాగోతంలోనూ కీలకంగా వ్యవహరించారని వెల్లడైంది. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసు దర్యాప్తులో కీలక ప్రగతి సాధించిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజా పరిణామాలతో తక్షణం రంగంలోకి దిగింది. ముడుపుల తరలింపులో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ వాసుదేవ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లను విచారించాలని నిర్ణయించింది. ఈమేరకు వారికి నోటీసులు జారీ చేసి దర్యాప్తును వేగవంతం చేసేందుకు సిద్ధమైంది.

బాబు అవినీతి 'స్కిల్'...

టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన సూత్రధారిగా ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం జరిగినట్లు 'సిట్' ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా మోసగించి ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు ఆధారాలతో సహా నిరూపించింది. రూ.3,300 కోట్ల ప్రాజెక్టును కాగితాలపై చూపించి సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు సమకూరుస్తుందని బుకాయించి రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి మొత్తం రూ.371 కోట్లను అడ్డగోలుగా చెల్లించేశారు. అలా నిధులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావుతోపాటు మరో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులు వారించినా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఖాతరు చేయలేదు. ఏకపక్షంగా రూ.371 కోట్లను సీమెన్స్ భాగస్వామ కంపెనీగా ఒప్పందంలో చూపించిన డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేశారు. అందులో రూ.241 కోట్లను పలు షెల్ కంపెనీలను సృష్టించి హవాలా మార్గంలో టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యనేత కొల్లగొట్టారు. ఈ కేసులో సిట్ అధికారులు 8 మందిని అరెస్టు చేశారు. హవాలా మార్గంలో నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చినందున కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కూడా రంగంలోకి దిగింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని నిర్ధారించి ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయడంతోపాటు డిజైన్ టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్లను అటాచ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

షెల్ కంపెనీలు.. బోగస్ ఇన్వాయిస్‌లు

టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలో తాత్కాలిక నిర్మాణాల కాంట్రాక్టులను కట్టబెట్టిన కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్నవారే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలోనూ కీలకపాత్ర పోషించారని సిట్ గుర్తించింది. షాపూర్జీ– పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్.. ఈ ముగ్గురూ అమరావతి భవన నిర్మాణాల కాంట్రాక్టు అవినీతి సొమ్మును చంద్రబాబుకు చేర్చడంతో కీలకంగా వ్యవహరించారన్నది ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. రూ.8 వేల కోట్ల విలువైన నిర్మాణాల కాంట్రాక్టుల్లో భారీ అవినీతికి పాల్పడి ఆ నల్లధనాన్ని మనోజ్ వాసుదేవ్ పార్థసాని షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేర్చారు. అందుకోసం షెల్ కంపెనీలను సృష్టించడంలో యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. ఆయన నివాసంలో ఐటీ శాఖ అధికారులు సోదాలు కూడా నిర్వహించారు. మరోవైపు ఆ షెల్ కంపెనీల పేరుతో మళ్లించిన నిధులను డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసాని నగదు రూపంలో చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో అందించారు. ఆ విధంగా చంద్రబాబుకు చేరిన అక్రమార్జనలో రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పాలని ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడం జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

బాబుకు ముడుపులు చేరాయిలా..

అమరావతిలో తాత్కాలిక నిర్మాణ కాంట్రాక్టుల అవినీతి దందాలో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్ ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో ప్రధాన భూమిక పోషించిన తీరు ఇదీ..

- ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టేందుకు యోగేశ్ గుప్తా పలు షెల్ కంపెనీలను సృష్టించాడు. ముంబై, పుణే కేంద్రాలుగా సృష్టించిన షెల్ కంపెనీల పేరిట నకిలీ ఇన్వాయిస్‌లను సమర్పించారు. ఆ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు ఏపీఎస్ఎస్‌డీసీ రూ.371 కోట్లను విడుదల చేసింది. దీనిపై ఆధారాలు సేకరించిన అనంతరం సిట్ అధికారులు ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో కేసులో యోగేశ్ గుప్తాను ఏ–22గా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు.
- నకిలీ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు చేరిన రూ.371 కోట్లను యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ పార్థసానికి అందించాడు. ఆయన అందులో రూ.241 కోట్లను ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలించాడు. రూ.241 కోట్ల నగదు మొత్తాన్ని హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించాడు.
- ఆ రూ.241 కోట్ల నగదు మొత్తం పెండ్యాల శ్రీనివాస్ ద్వారా చివరకు హైదరాబాద్‌లో చంద్రబాబు నివాసానికి చేరినట్లు స్పష్టమవుతోంది.

ఆ ముగ్గురికీ సిట్ నోటీసులు

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టడంతో పాత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. వచ్చే సోమవారం విజయవాడలో సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కావాలని యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసానికి నోటీసులిచ్చారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ ఈనెల 14న విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

'గోవింద కోటి' రాసిన వారికి బ్రేక్ దర్శనం


బోర్డు సభ్యులతో చైర్మన్ భూమన

- విద్యార్థులకు కోటి భగవద్గీత పుస్తకాల పంపిణీ
- సనాతన ధర్మం అనేది మతం కాదు.. అదొక జీవనయానం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల: యువతలో హైందవ సనాతన ధర్మ వ్యాప్తి కోసం శ్రీవారి ఆలయం నుంచే తొలి అడుగు వేస్తున్నామని, ఇందులో భాగంగా రామకోటి తరహాలో గోవింద కోటి రాసిన 25 ఏళ్ల లోపు వారికి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఒకసారి తిరుమల స్వామివారి బ్రేక్ దర్శనం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. 10 లక్షల 1,116 సార్లు గోవింద నామం రాసిన వారికి దర్శన సౌభాగ్యం కల్పిస్తామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వివరించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా 20 పేజీల్లో భగవద్గీత సారాంశాన్ని పుస్తక ప్రసాదంగా కోటి పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి టీటీడీ ద్వారా గతంలో ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ముంబైలోని బాంద్రాలో రూ.1.65 కోట్లతో శ్రీవారి రెండో ఆలయం, రూ.5.35 కోట్లతో సమాచార కేంద్రాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని టీటీడీ బోర్డు సభ్యులు విరాళంగా అందిస్తారన్నారు. రూ.33 కోట్లతో వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన స్థలంలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని, ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారన్నారు. రూ.600 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ వెనుక వైపు ఉన్న 2,3 సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. టీటీడీ ఆలయాల్లో 413 పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు చెప్పారు. తిరుపతిలో నిర్మాణం కానున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 300 మందిని నియమించనున్నట్లు చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మగిరి, కీసరగుట్ట, విజయనగరం, ఐ.భీమవరం, కోటప్పకొండ, తెలంగాణలోని నల్లగొండ వేద విజ్ఞాన పీఠాలకు సంబంధించి అదనంగా 47 అధ్యాపక పోస్టులను మంజూరు చేసినట్లు చెప్పారు.

ఉదయనిధి మాటలను ఖండిస్తున్నాం

సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను భూమన ఖండించారు. సనాతన ధర్మం మతం కాదని, అదొక జీవన యానమని చెప్పారు. ఈ విషయం తెలియక సనాతన ధర్మానికి కులాలను ఆపాదించి విమర్శలు చేస్తే సమాజంలో అలజడి చెలరేగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విమర్శకులకు కూడా మంచిది కాదన్నారు.

బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి

- ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా దేశంలో జరిగిన అభివృద్ధి గురించి పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్రమంత్రులు ప్రకటించారన్నారు. అయితే 76 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశంలోని 56 శాతం జనాభా గల బీసీ కులాల బతుకులు ఎలా బాగుపడ్డాయో, బాగుపడటానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా పార్లమెంట్‌లో చర్చ జరగాలని కృష్ణయ్య కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లులో మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళా బిల్లుకు సార్థకత లేదని కృష్ణయ్య తెలిపారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకుని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

జిల్లా వార్తలు

ఆదివాసీ జాతీయ మహాసభల ప్రతినిధిగా వీరభద్రం


భూక్యా వీరభద్రం

వైరా: ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ ఆధ్వర్యాన జరగనున్న నాలుగో జాతీయ మహాసభలకు తెలంగాణ ప్రతినిధిగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ఎంపికయ్యారు. తమిళనాడు రాష్ట్రంలోని సమక్కల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు మహాసభలు జరగనున్నాయి. ఈ మేరకు వీరభద్రాన్ని జాతీయ మహాసభల ప్రతినిధిగా ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా ఐటీడీఏ సాధన కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న ఆయన మాట్లాడుతూ.. గిరిజన తెగల ఐక్యత, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన పోరాటాలపై సభల్లో చర్చిస్తానని తెలిపారు.

బొగ్గు గనుల్లో రక్షణ చర్యల్లో నిర్లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గుగనుల్లో రక్షణ విషయమై యాజమాన్యాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారని అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆరోపించారు. నాగ్‌పూర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సమావేశాల్లో ఆయన మంగళవారం మాట్లాడారు. బొగ్గుగనుల్లో రక్షణపై యాజమాన్యాల నిర్లక్ష్యంతో అమాయకులైన కార్మికుల కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. ఇకనైనా ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే, కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులు, ఆరోగ్య, ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై 6వ తేదీన అన్ని ఏరియాల జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాగ్‌పూర్ ఎమ్మెల్యే టి.లోకేశ్వర్‌రాథోడ్, నాయకులు సుధీర్‌గురుడే, పి.మాధవ్‌నాయక్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి సింగరేణిలో బయోమెట్రిక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా హాజరు నమోదు కోసం ఈ నెల 11వ తేదీ నుంచి బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ విషయమై యాజమాన్యం మంగళవారం అన్ని ఏరియాలకు ఆదేశాలు జారీ చేసింది. గతంలోనూ ఈ విషయమై ప్రకటన చేసినా ఇప్పుడు అమలుకు సిద్ధమయ్యారు. బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు కోసం ఏర్పాట్లు చేయాలని ఏరియాల అధికారులను యాజమాన్యం ఆదేశించింది.

గురుకుల ఉపాధ్యాయులకు తీపి కబురు

- సర్వీసు క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- ఖమ్మం రీజియన్‌లో 96 మందికి లబ్ధి



ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ గురుకులాల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ కాగా.. ఈ నిర్ణయంతో ఖమ్మం రీజియన్‌లో 96 మందికి మేలు జరగనుంది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం జిల్లా గురుకుల పాఠశాలల్లో 53 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎనిమిది గురుకుల పాఠశాలల్లో 25 మంది, మహబూబాబాద్ జిల్లాలోని ఐదు గురుకులాల్లో 18 మంది ఉపాధ్యాయులు ఇక నుంచి రెగ్యులర్ కానున్నారు. వీరందరూ గత పదహారేళ్లుగా కాంట్రాక్టర్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, వీరికి 12 నెలల వేతనం, బేసిక్ పేతో పాటు ఆరు నెలల ప్రసూతి సెలవులు వర్తించనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణపై మంత్రి పువ్వాడ హర్షం

ఉపాధ్యాయ దినోత్సవ కానుకగా కాంట్రాక్టు ఉపాధ్యాయుల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు 12 నెలల జీతం, బేసిక్ పేతో పాటు ఆరు నెలల ప్రసూతి సెలవులను ప్రభుత్వం ప్రకటించడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.

డీసీసీబీలో యూపీఐ సేవలు



యూపీఐ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్ నాగభూషణం, అధికారులు, డైరెక్టర్లు

డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ఖాతాదారుల సౌకర్యార్థం యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ వివరాలను బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషణం వెల్లడించారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రవేశపెట్టిన యూపీఐ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు సీఈఓ అట్లూరి వీరబాబు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్‌లో మొబైల్ బ్యాంకింగ్ సేవలను, ఇప్పుడు యూపీఐ సేవలను ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ సౌకర్యం పొందేందుకు ఖాతాదారులు సంబంధిత బ్రాంచ్ మేనేజర్లను సంప్రదించి సీబీఎస్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

17న మోటార్ మెకానిక్ ట్రెయినీ రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2017లో విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన మోటార్ మెకానిక్ ట్రెయినీ (కేటగిరీ–1) అభ్యర్థులకు ఈ నెల 17న రాతపరీక్ష నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందని రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు సింగరేణి వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కాగా, అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డ్‌తో పాటు ఓటర్ గుర్తింపు కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్ తదితర ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని, ఉద్యోగాలు ఇప్పిస్తామనే దళారుల మాటలు నమ్మొద్దని తెలిపారు.

ఐదో రోజుకు చేరిన 'అగ్నివీర్'


1,600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

ఖమ్మంస్పోర్ట్స్: సైన్యంలో నియామకాలకు సంబంధించి ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా 1,207 మందికి అడ్మిట్ కార్డులు జారీ చేయగా 900 మంది హాజరయ్యారు. అన్ని పరీక్షలు పూర్తయ్యాక వీరిలో 432 మంది మెడికల్ టెస్ట్‌కు అర్హత సాధించారు. రోజులాగే అభ్యర్థులు సోమవారం రాత్రికే ఖమ్మం చేరుకుని పోటీల్లో పాల్గొన్నారు.

అర్హత సాధిస్తున్నది తక్కువ మందే..

ఆన్‌లైన్ పరీక్ష రాసిన అభ్యర్థుల్లో అర్హత సాధించిన వారిని ఈవెంట్లకు ఎంపిక చేశారు. ఇందుకోసం వీరు వివిధ సెంటర్లలో శిక్షణ తీసుకున్నారు. కొందరు అభ్యర్థులు నేరుగా పోటీలకు హాజరవుతుండగా, మరికొందరు బృందంగా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులతో వస్తున్నారు. కాగా, హాజరు శాతమే తక్కువగా ఉంటుండగా వీరిలోనూ పలువురు ఈవెంట్లు దాటడం లేదు. అయితే, పలువురు నిరుపేద అభ్యర్థులు శిక్షణకు స్థోమత లేక ఉద్యోగం వచ్చాక డబ్బు చెల్లిస్తామని సర్టిఫికెట్లను కోచింగ్ సెంటర్ల నిర్వాహకులకు అప్పగించినట్లు తెలుస్తోంది. తీరా ఈవెంట్లలో ఉత్తీర్ణత సాధించకపోవడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక


విజేతలను ఫోన్‌లో అభినందిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మంమామిళ్లగూడెం: రాఖీ పండుగ సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రవేశపెట్టిన లక్కీ డ్రాలో విజేతలను మంగళవారం ఎంపిక చేశారు. ఖమ్మం రీజియన్‌లోని ఆరు ఆర్టీసీ డిపోల బస్సుల్లో గత నెల 30, 31వ తేదీల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులు తమ టికెట్లను బాక్సుల్లో వేశారు. వారి నుంచి విజేతల ఎంపిక కోసం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం డ్రా తీశారు. జిల్లా సంక్షేమ అధికారి టి.సుమ డ్రా తీయగా.. సత్తుపల్లికి చెందిన రుక్మిణి, కల్లూరుకు చెందిన జి.భారతి, పెనుబల్లి మండలం తుమ్మలపల్లికి చెందిన లక్ష్మి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. కాగా, విజేతలకు ఈనెల 8న ఎంజీబీఎస్‌లో జరిగే సమావేశంలో రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం జీఎస్ పవిత్ర, ఖమ్మం డీఎం శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్, రామయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం పలువురు ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈసందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, నలుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వీరికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ అవార్డులు అందజేసి సన్మానించారు.
– సాక్షి నెట్‌వర్క్


ఆవుల రాంబాబు, రాపల్లి యూపీఎస్, బోనకల్


వెంపటి ఉషారాణి, ఎస్‌జీకే పాఠశాల, భద్రాచలం


డి.సురేష్‌బాబు, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం


టి.అరుణకుమారి, లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ


ఏ.ఆర్.సత్యవతి, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం


ఎం.పూర్ణచందర్‌రావు, లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ


గుంటి రమాదేవి, కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తగూడెం